ప్రజాశక్తి
గురువారం 12 జూన్ 2025
7
అల్లూరి సీతారామరాజు

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు: మండలంలోని దారెల పంచాయితీ కుమ్మరిపుట్టు గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులను బుధవారం స్థానిక సర్పంచ్, టిడిపి డివిజన్ నాయకులు పాంగి. పాండురంగ స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కుమ్మరి పుట్టు గ్రామానికి 75 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించడం సంతోషకరమన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ గిరీష్ దొర ,టిడిపి నాయకులు మాణిక్యం, గోపాలం, నాగేష్ పాల్గొన్నారు.

పనులు ప్రారంభిస్తున్న నాయకులు

మన్యంపై కూటమి సర్కారు శీతకన్ను

▶▶ అందని ద్రాక్ష గానే శతశాతం ఉద్యోగ రిజర్వేషన్

▶▶ తప్పని డోలీ మోతలు, అవస్థలు పడుతున్న గిరిజనులు

▶▶ ఆశ్రమాల్లో హెల్త్ వలంటీర్ల భర్తీ పై నెరవేరని గిరిజన మంత్రి హామీ

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి జిల్లా మన్యంలో ఆదివాసీలు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై అసంతృప్తిని అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు ఆదివాసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా పలు గిరిజన సమస్యలపై స్పందన కరువైందని వాపోతున్నారు. ఆదివాసీల పట్ల కూటమి ప్రభుత్వాన్ని పక్షపాత వైఖరి అవలంభిస్తోందని విమర్శిస్తున్నారు.

గిరిజనులకు ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పన, విద్యా వైద్య పరంగా మన్యంలో ఎటువంటి పురోగతి కానరాని పరిస్థితి నెలకొంది. ప్రధానంగా జీవో నెంబర్ 3 మూడు శాతం ఉద్యోగ రిజర్వేషన్ పునరుద్ధరిస్తామని ఎన్నికల ముందు చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు గెలిచాక కూడా ప్రత్యామ్నాయ జీవో తెస్తామని చట్టబద్ధత కల్పిస్తామని ఇచ్చిన ఇచ్చిన హామీని నెరవేర్చలేదు. అంతే కాకుండా సీఎం తన పుట్టినరోజు కానుకగా మెగా డీఎస్సీ ని ప్రకటించి ఆదివాసీలకు దగా చేశారని సర్వత్రా నిరసన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా అరకు లోయను ఎడ్యుకేషన్ హబ్ గా తీర్చిదిద్దుతామని ఒక స్టడీ సర్కిల్ ను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చలేదు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ వాలంటీర్లను తిరిగి నియమిస్తామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి గత ఏడాది మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ప్రకటించారు. కానీ నేటికీ ఎటువంటి చర్యలు లేవు. మన్యంలోని కొండకోనల్లో గిరి బాల్యం విద్యాభివృద్ధికి పునాది వేస్తూ వివిధ గిరిజన మాతృభాషల్లో విద్యా బోధన చేస్తున్న భాషా వాలంటీర్లు దశాబ్దాల కాలంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఏజెన్సీలోని మారుమూల ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో ప్రత్యేక విద్య బోధన చేస్తున్న భాషా వాలంటీర్లు తమకు ఉద్యోగ భద్రత కనీస వేతనం కల్పించాలని మొరపెట్టుకుంటున్న ప్రభుత్వం నుంచి చర్యలు లేవు.

గిరిజనుల్లో జీరో పేదరికం కోసం అన్ని మౌలిక వసతులు కల్పించడానికి ప్రభుత్వం చేసిన హామీ నెరవేర్చడంలో ఎటువంటి పురోగతి లేదు . .

తప్పని డోలీ మోతలు

మన్యంలో కొండ ఎగువున ఉన్న గ్రామాలకు రహదారి సౌకర్యాలు లేకపోవడం వల్ల అత్యవసర వైద్య సేవల కోసం డోలి మోతలతో రోగులను ఆసుపత్రులకు తరలించే గిరిజనులు పడుతున్న ప్రయాస ఇబ్బందులను అధిగమించడానికి ప్రభుత్వం ఇచ్చిన హామీ అడుగు ముందుకు పడలేదు. ఏజెన్సీలో డోలి మోతలే శరణ్యమైన రహదారిలేని సుమారు 771 గిరిజన గ్రామాలను వైద్యారోగ్య శాఖ గుర్తించింది. ఎటువంటి రవాణా సౌకర్యం లేని ఈ గ్రామాలకు రహదారులను నిర్మించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. మన్యంలో గిరిజనులకు వైద్యారోగ్య సేవల విస్తరణకు మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు ఏర్పాటు అరకులోయ ప్రభుత్వ ఆస్పత్రిని ఏరియా ఆస్పత్రి గా మార్పు చేయడం అల్లూరి జిల్లా కేంద్రంలో డ్రగ్ స్టోర్ ఏర్పాటు ఆసుపత్రులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మందులు సరఫరా చేసేందుకు రెండు వాహనాలు ఏర్పాటు వంటి ప్రతిపాదనలు, హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదని ఉంది.



అనంతగిరి మండలం మల్లెపాడులో డోలీలో తరలిస్తున్న కుటుంబసభ్యులు(ఫైల్)

నెరవేరని సిహెచ్‌డబ్ల్యుల 'ఆశ'

ఏజెన్సీలో మారుమూల గ్రామాల్లో వైద్య సేవలు అందిస్తున్న సామాజిక ఆరోగ్య కార్యకర్తలను ఆశా వర్కర్లుగా మార్పు చేయడంపై చాలా తాత్సారం నెలకొంది. గత ఏడాది కాలంగా అనేకసార్లు కొత్త ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా ఈ సిహెచ్ డబ్ల్యు ల ఆశ నెరవేర్చలేదు. ఏజెన్సీలో విద్యా వైద్య రంగాల్లో గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వానికి సమస్యలు పట్టక పోవడం పై నిరసనలు వ్యక్తం అవుతున్నాయి.

మోగనున్న బడిగంట

-నేటి నుంచి పాఠశాలలు పున:పారంభం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పాఠశాలలకు వేసవి సెలవులు ఈనెల 11వ తేదీతో ముగిసాయి. ఈనెల12వ తేదీ నుంచి పాఠశాలలు పున్ణ ప్రారంభం అవుతాయి. ఇక ఎప్పటిలాగానే బడిగంటలు మోగనున్నాయి. సెలవుల్లో హాయిగా, ఆనందంగా గడిపిన చిన్నారులు ఇక భుజాన బ్యాగులు వేసుకుని బడికి వెళ్లే సమయం ఆసన్నమైంది. పిల్లలు వేసవి సెలవులు, ఆటలకు స్వస్తిపలికి బడిబాట పట్టనున్నారు. ఇప్పటికే పిల్లలు, తల్లిదండ్రులు ఈ విద్యా ఏడాదికి సంబంధించిన స్టేషనరీ, బ్యాగులు, పుస్తకాలు తదితర సామగ్రి కొనుగోలు చేశారు. పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రులను రారమ్మని.. రారా రమ్మని.. స్వాగతం పలుకుతున్నాయి. మరోవైపు పలు సర్కారు బడులు ఇంకా సౌకర్యాల లేమితోనే విద్యార్థులను ఆహ్వానిస్తున్నాయి.

ప్రభుత్వ ఆదేశాలతో గురువారం నుంచి 2025-2026 విద్యా సంవత్సరం బడిగంటలు మోగనున్నాయి. విద్యార్థుల ఉరుకులు పరుగులు.. కేరింతలు.. మొదలవనున్నాయి. ఇప్పటికే సర్కారు బడుల్లో తరగతి గదులు, ఇతర సదుపాయాల కోసం విద్యాశాఖ ఆదేశాలు జారీచేయగా.. ప్రైవేట్ విద్యాసంస్థలు అలంకరణలు, అడ్మిషన్లు వంటి ప్రక్రియను ఇప్పటికే పూర్తిచేశాయి. బడ్జెట్ పాఠశాలలు కొత్త విద్యార్థులను ఆకర్షించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. పదో తరగతిలో సాధించిన ఫలితాలతో ఆకర్షణీయ ప్రకటనలు, పాంప్లెట్లతో ప్రచారం ప్రారంభించాయి.

1లక్షా 90వేల మంది విద్యార్థులు

అల్లూరి జిల్లా పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ విద్యా సంస్థలు కలిసి మొత్తం సుమారు 3023 ఉన్నాయి. కళాశాలలు 49, పాఠశాలలు 2,974 ఉండగా, అందులో దాదాపు 1లక్షా 90వేలు పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభంలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక ఒత్తిళ్లు తప్పడం లేదు. డొనేషన్లు, స్కూల్ ఫీజులు, పుస్తకాలు, స్టేషనరీ తదితర ఖర్చులతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు భారంగా మారుతున్నాయి. కొద్దోగొప్పో సంపాదనాపరుల పరిస్థితి ఇలా ఉంటే.. చాలీచాలని వేతనాలతో కాలం గడిపే అసంఘటిత కార్మికులు, చిరుద్యోగుల పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. ఇద్దరు పిల్లలున్న తల్లిదండ్రులు చదువు కోసం సాధారణ బడ్జెట్ స్కూల్లోనే రూ. లక్షకు పైగా ఖర్చు చేయాల్సి వస్తుందనేది ఫీజుల పట్టికను చూస్తే అర్థమవుతుంది.

పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

భూమి చదును పనులు ప్రారంభం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని కంద్రుమ్ పంచాయితీ బైలుగూడ గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన భూమి చదును పనులను స్థానిక పంచాయతీ సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కే.హరి, వైస్ ఎంపీపీ ఎస్.ఆనంద్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామాల్లో ఉపాధి హామీ పథకంను ఉపయోగించుకొని గిరిజనులు తమ పంట పొలాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం వసంత, రియల్ అసిస్టెంట్ దేవకి, పీసా ఉపాధ్యక్షుడు పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ అమల్లో జిల్లా అగ్రస్థానం

-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ వెల్లడి

ప్రజాశక్తి- పాడేరు: ఉపాధి హామీ పథకం అమలులో జిల్లా అగ్ర స్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ ఎ .ఎస్. దినేష్ కుమార్ అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో డ్వామా ఆధ్వర్యంలో నిర్వహించిన సుపరిపాలన స్వర్ణాంధ్ర ప్రదేశ్ సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో రూ.600 కోట్ల ఉపాధి హామీ పనుల షెల్ఫ్ సిద్దం చేసామని చెప్పారు. 5.250 కోట్లతో భూములను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఆయా భూముల్లో కాఫీ, మిరియాలు, రాజ్మా పంటలను సాగు చేయాలన్నారు. గత ఏడాది ఉపాధి శ్రామికులకు 65 శాతం పనులను కల్పించామన్నారు. ఈ ఏడాది జాబ్ కార్డుదారులకు 100 రోజులు పనిదినాలు కల్పించడానికి అన్ని విధాలు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి రాష్ట్రాభివృద్ధికి విజన్ స్వర్ణాంధ్ర 2047 అమలు చేస్తున్నారని చెప్పారు. సచివాయలం, మండల స్థాయి, జిల్లా స్థాయిలో విజన్ డాక్యుమెంటు తయారు చేయడం జరిగిందన్నారు.రానున్న మూడేళ్లలో లక్ష ఎకరాలలో కాఫీ విస్తరణకు ముఖ్య మంత్రి ఆదేశాలు జారీ చేసారని చెప్పారు. ఈ ఏడాది 30 ఎకరాలలో కాఫీ సాగును విస్తరిస్తున్నామని అన్నారు. కిలో కాఫీని రూ.525 లకు విక్రయించడం జరిగిందన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో రూ.40 కోట్ల పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు.

పాడేరు మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ, ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను సద్వినయోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. యువత కొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్, ఆర్టీసి చైర్మన్ దొన్ను దొర, ఎన్డీని ఎంవి లోకేశ్వరరావు, ఎన్ఎంఐఇఇ రాజేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ కె.వేణుగోపాల్, రహదారులు భవనాల శాఖ ఇఇ బాల సుందరబాబు, ఉపాధి హామీ శ్రామికులు, గ్రామైఖ్య సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

-హోం మంత్రి అనిత

ప్రజాశక్తి- పాయకరావుపేట: మండలంలోని నామ వరం గ్రామస్థులతో బుధవారం హెూం మంత్రి వంగలపూడి అనిత ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సమస్యలు తెలుసుకొని సంబంధింత అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే సమస్యలను పరిష్కరించారు. ఈ సంధర్భంగా హెూం మంత్రి అనిత మాట్లాడుతూ... జల్లూరు, పందూరు బ్రిడ్జిల నిర్మాణ పనులు త్వరలోనే పూర్తి కానున్నాయన్నారు. రేవు పోలవరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. పాయకరావుపేట పట్టణంలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా త్వరలోనే మారుస్తున్నామన్నారు. బల్క్ డ్రగ్ ఫ్యాక్టరీ, స్టీల్ ప్లాంట్ రాకతో పెద్ద సంఖ్యలో స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు రానున్నాయని అన్నారు. త్వరలో పూర్తి స్థాయిలో ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగు నీరు సరఫరా చేస్తామని తెలిపారు. నామవరం గెడ్డకాలువను వెంటనే శుభ్రం చేయించాలని అధికారులను హెూం మంత్రి అనిత ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ కురందాసు శివ, ఎంపిపి ఇసరపు పార్వతి, తెలుగుదేశం పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ , పార్టీ మండల ప్రెసిడెంట్ చించలపు ప్రదీప్ (పద్దు), పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గొర్ల లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ పల్లా బాబూరావు, వార్డు మెంబరు షేక్ వెంకా సాహెబ్, తహశీల్దారు గారా ఆనందరావు, మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్ చింతలపాటి రవికుమార్ వర్మ, పంచాయతీ కార్యదర్శి ఎమ్ మల్లిఖార్జునాచారి పాల్గొన్నారు.

పాయకరావుపేట: పట్టణంలో తెలుగుదేశం పార్టీ నూతన కార్యాలయాన్ని హెూం మంత్రి వంగలపూడి అనిత బుధవారం ప్రారంభించారు.

మౌలిక సదుపాయాల కల్పనపై గిరిజనులకు అవగాహన

ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏజెన్సీలోని గిరిజన మారుమూల గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పనకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ధర్తీ అభజన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ ద్వారా గిరిజనులకు అవగాహన కల్పిస్తామని ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలోని ధర్తీ అభజన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ (డిఎజూగా) పథకం అమలు చేయడానికి ఏజెన్సీలో 211 గ్రామాలను ముందుగా గుర్తించడం జరిగిందని అదేవిధంగా అడ్డతీగల మండలంలో 7, దేవీపట్నం మండలంలో 11, గంగవరం మండలంలో 47, మారేడుమిల్లి మండలంలో 40, రాజమ్మంగి మండలంలో 14, రంపచోడవరం మండలంలో 23, వైరామవరం మండలంలో 67 గ్రామాలను మౌలిక సదుపాయాలు కల్పనకు ముందుగా గుర్తించామని ఆయన తెలిపారు. అదే విధంగా సబ్‌ప్లాన్ ఏరియాలో రౌతులపూడి మండలంలో ఒక గ్రామం, శంఖవరం మండలంలో మూడు గ్రామాలు, ప్రత్తిపాడు మండలంలోని రెండు గ్రామాలు గుర్తించడం జరిగిందని ఈ గుర్తించిన గ్రామాలలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో, సిబ్బందితో కమిటీలు వేయడం జరిగిందని అదేవిధంగా ఈ కమిటీలు గుర్తించిన గ్రామాల్లో వివిధ గిరిజన తెగలకు సదస్సుల ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. ఈనెల 15వ తేదీ నుంచి ఈ నెల 30 వరకు డిఎ జూగా ద్వారా అవగాహన సదస్సులలో అర్హులైన లబ్ధిదారులకు ఆధార్‌కార్డులు, ఆయుష్మాన్‌భారత్ కార్డులు, పిఎం ఆవాస్ యోజన పథకంలో పక్కాగృహాలు, పాఠశాలల నిర్మాణాలు, ఏకలవ్య మోడల్ పాఠశాలల నిర్మాణాలు, వైద్యఆరోగ్యసేవలు అందించే విధంగా తగు చర్యలు చేపడతామన్నారు. ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద ఆర్థిక చేకూర్పు కల్పించాలని అదేవిధంగా గ్యాస్ కనెక్షన్లు లేని లబ్ధిదారులను గుర్తించి పిఎం ఉజ్వల్ పథకంలో గ్యాస్ కనెక్షన్లు అందించాలన్నారు.

ప్రతి కుటుంబానికి బ్యాంక్ అకౌంట్ ప్రారంభించాలన్నారు. దర్తి అభజన జాతీయ గ్రామఉత్కర్ష అభియాన్ సమర్ధంగా అమలు చేయటానికి మండల స్థాయి, గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. దర్తి అభజన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కోరారు.

వర్చువల్‌గా అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - రంపచోడవరం : రంపచోడవరం నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు వర్చువల్ ప్రొగ్రాం ద్వారా ఐటిడిఎ పిఒ సింహాచలం, రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ బుధవారం ఆవిష్కరించారు. స్థానిక ఐటిడిఎ సమావేశపు హాలులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పిఒ సింహాచలం మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గ పరిధిలో డిఎజెజియుఎ అండ్ ఆర్టికల్ 275 (1) అంచనా విలువ 63.53 కోట్లతో కేంద్ర ప్రభుత్వ నిధులతో పాఠశాలల అదనపు వసతులు ఆధునీకరణ, ఉపాధ్యాయుల వసతిగృహాలు, రహదారులు, వంతెనలు, రబ్బరు పరిశ్రమ అనుసంధానం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన ప్రాంత అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నాయన్నారు. రంపచోడవరం నియోజకవర్గ పరిధిలో అన్ని మండలాల పరిధిలో గల గ్రామాల్లో గిరిజనుల అభివృద్ధికి శంకుస్థాపన చేశామని, పనులు సకాలంలో పూర్తి చేసే విధంగా తగు చర్యలు చేపడతామన్నారు. చింతూరు ఐటిడిఎ పిఒ అపూర్వభారత్, రంపచోడవరం సబ్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ మాట్లాడుతూ వర్చువల్ ప్రొగ్రాం ద్వారా శంకుస్థాపన చేసిన పనులన్నీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎప్పటికప్పుడు పర్యవేక్షించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో అదనపు తరగతి గదులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అదనపు పనులు తస్కాల్ స్కేల్ యూనిట్లకు అనుసంధాన పనులు కమ్యూనిటీ హాలులా పనులు, గోకులం షెడ్లు (29) నిర్మాణం నిధులు బిఎఐఎఫ్, ఇఎల్ కేంద్ర ప్రభుత్వ నిధులతో అంచనా విలువ 90.10 లక్షల వ్యయంతో నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఎపిఒ జనరల్ డి.ఎన్. రమణ, గిరిజన సంక్షేమశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు శ్రీనివాసరావు, మురళి, డిప్యూటీ ఇంజనీర్లు చైతన్య, గౌతమి, నాగరాజు ఏఈ శ్రీవిద్య , సూపరింటెండెంట్లు కిషోర్, రాజారెడ్డి, మహేశ్వరరావు, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐటిడిఎ సమావేశ భవనంలో వర్చువల్ శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

బ్యాక్‌వాటర్‌తో ముంపు గ్రామాల్లో వరద భయం

నదీతీరగ్రామాల్లో పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

ప్రజాశక్తి - వీఆర్‌పురం: పోలవరం బ్యాక్‌వాటర్‌తో మళ్ళీ ముంపు గ్రామాల్లో వరద భయం మొదలైంది. జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌లో కురిసే భారీ వర్షాలకు బ్యాక్‌వాటర్ పోటుతో వరద ముంపు భారీఎత్తున ఉండే అవకాశాలు ఉంటాయని నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల నిర్వాసితులు భయాందోళనతో పునరావాస కేంద్రాల్లో తలదాచుకునేందుకు ఇళ్లు పూర్తవకుండానే వెళ్లిపోతున్నారు. ఈ సంవత్సరం కూడా చాలామంది నిర్వాసితులు సమీప గుట్టల్లోనే పాకలు వేసుకుని ఉండేలా గోదావరి నదీతీరగ్రామాల్లో ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రభుత్వం శరవేగంగా పునరావాస ప్రక్రియ పనులు పూర్తిచేస్తే అక్కడికి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికైనా నిర్వాసిత కాలనీల్లో పనులు త్వరగా పూర్తి చేయాలని పోలవరం నిర్వాసితులు కోరుతున్నారు.

మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్‌కుమార్

ఎకో సెన్సిటివ్ జోన్ల పేరుతో భూసేకరణ ఆపాలి

ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పూనెం ప్రదీప్‌కుమార్

ప్రజాశక్తి - విఆర్‌పురం: ఎకోసెన్సిటివ్‌జోన్ల పేరుతో ఆదివాసీ గ్రామాలు ఆదివాసీలు సాగు చేసుకునే భూములను స్వాధీనం చేసుకునే కుట్రపూరిత విధానం దారుణమని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పూనెం ప్రదీప్‌కుమార్ అన్నారు. బుధవారం రేకపల్లిలో జరిగిన ఆదివాసీ గిరిజన సంఘ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఎటువంటి సమాచారం అందించకుండా అటవీ శాఖాధికారులు కార్యదర్శులు, సర్పంచుల ద్వారా తీర్మానం ఇవ్వమని ఒత్తిడి చేయడం సరైన విధానం కాదన్నారు. పాపికొండలు నేషనల్ పార్క్ పరిధిలో ఉన్న సుమారు 44 ఆదివాసీ గ్రామాల పరిధిలో భూములను ఎకోసెన్సిటివ్ జోన్ పేరుతో ప్రజలెవ్వరికీ తెలీకుండా పీసా కమిటి జోక్యం లేకుండా గ్రామసభల తీర్మానాల పేరుతో సంతకాలు సేకరణ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తోందన్నారు. పోలవరం ప్రాజెక్టు పేరుతో ఓ పక్క ముంచేస్తూ మిగిలిన భూమిని అభయా రణ్యం సెన్సిటివ్ జోన్‌తో స్వాధీనం చేసుకునే కుట్రపూరిత విధానం దారుణ మన్నారు. ప్రజలకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అటవీ శాఖ అధికారులు కార్యదర్శుల ద్వారా తీర్మానం ఇవ్వమని ఒత్తిడి చేయడం సరైన విధానం కాదన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు గ్రామ సభలు పెట్టి ఈ ఎకోసెన్సిటివ్ జోన్‌పై ప్రజలకు పూర్తి వివరాలు తెలపాలని హెచ్చరించారు. మండల వ్యాప్తంగా ఉన్నటువంటి ఆదివాసీలను సమీకరించి భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సోయం చిన్నబాబు, కారం సుందరయ్య చిక్కాల రామారావు, కారం సత్తిబాబు, పోడియం శ్రీరామమూర్తి, తుర్రం బాబురావు, వేటగాని సూరి, సారా పాండురాజు, బీరబోయిన గౌతం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

జీడిమామిడి రైతుల ఆర్థికాభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏజెన్సీలో జీడిమామిడి తోటల గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా తగు చర్యలు చేపట్టనున్నట్టు రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం పేర్కొన్నారు. బుధవారం రంపచోడవరం హెచ్‌ఎంటిసి ఫారంలో జీడిమామిడి తోటల పునరుద్ధరీకరణ పథకానికి ఏడు మండలాల గిరిజన రైతులకు సబ్సిడీపై పురుగు మందులు రంపాలు పంపిణీ కార్యక్రమానికి రంపచోడవరం ఐటిడిఎ పిఒ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటిడిఎ పరిధిలోని ఏడు మండలాలలోని జీడిమామిడి తోటల రైతులకు పురుగు మందులు, కట్టర్లు, రంపాలు, ఒకరికి స్ప్రేయర్ ప్రస్తుతం మొత్తం 500 మంది గిరిజన రైతులకు జీడి మామిడి తోటలు పురుగులు నివారణ కోసం సబ్సిడీపై రైతులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని పిఒ సూచించారు. కార్యక్రమంలో పిహెచ్‌ఒ చిట్టిబాబు, సర్పంచులు చిన్నబాబు, ఎస్.బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

పండగలో పాల్గొన్న బిజెపి నాయకులు కంబాల శ్రీనివాసరావు

ఘనంగా గంగాలమ్మ జాతర

అన్నదానానికి 1,50,000 వేలు విరాళం

ప్రజాశక్తి - గంగవరం : గంగవరం మండలం పెద్ద అడ్డపల్లి గ్రామంలో బుధవారం గంగాలమ్మతల్లి జాతర ఘనంగా నిర్వహించారు. విశ్వహిందూ దర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బిజెపి నాయకులు కంబాల శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమానికి రూ.1,50,000లు విరాళాన్ని ఆయన కమిటి సభ్యులకు అందజేశారు. అమ్మవారిని దర్శించుకుని, బోనాలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడం కోసం, గిరిజన గ్రామాల్లో ఆధ్యాత్మిక, ధార్మిక ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుం దన్నారు. గిరిజనులు అందరూ కలిసికట్టుగా ఉండి మా ధర్మాన్ని పరిరక్షించు కోవాలని, పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అడ్డతిగల, వై.రామవరం, గంగవరం మండలాల్లోని పలు ఆలయాల అభివృద్ధికి సహకారం అందించాలని గిరిజన కంబాల శ్రీనివాసరావుని కోరగా, స్పందించిన ఆయన ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. క్రీడాకారుల క్రికెట్ కిట్లకు రూ.10వేలు అందించారు. కార్యక్రమంలో గోకవరం బిజెపి మండల అధ్యక్షులు ఇనకోటి బాపన్నదొర, నాయకులు వరసాల ప్రసాద్, దాసరి ధర్మరాజు, బత్తుల నానాజీ, బత్తిన వీరాంజనేయులు, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ ప్రసాదరావు

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ప్రజాశక్తి - కొయ్యూరు : కుట్టుమిషన్ల శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కొయ్యూరు ఎంపిడిఒ ప్రసాదరావు సూచించారు. కాకరపాడు కుట్టుమిషన్ల కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేశారు. నాణ్యమైన శిక్షణ అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. శిక్షణ పొందిన వారికి కుట్టుమిషన్లు ఉచితంగా ఇస్తామని చెప్పారు.

ఎండియు వాహనాలను పునరుద్ధరించాలి

• గిరిజనుల ఆందోళన

ఆందోళన చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఎండియు వాహనాల ద్వారా జిసిసి రేషన్ బియ్యంను పంపిణి చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఆదివాసీ గిరిజన సంఘ ఆధ్వర్యంలో కురిడి పంచాయతీ పితమరిగూడ గ్రామ గిరిజనులు బుధవారం ఆ గ్రామంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి సంక్షేమ పథకాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రేషన్ బియ్యంను గతంలో మాదిరిగా రేషన్ షాపుల్లో తీసుకోవాలని నిర్ణయించడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎండియు వాహనాలను పునరుద్ధరించి ఇంటింటికి రేషన్ బియ్యాన్ని పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు వి త్రినాథ్, కె జయరామ్, టి.సునీల్ కుమార్, బాబురావు పాల్గొన్నారు.

13న ఎంఎన్ఆర్ఇ వర్క్‌షాప్

- హాజరుకానున్న కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి, సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి- సీతమ్మధార : మినిస్ట్రీ ఆఫ్ న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ(ఎంఎన్ఆర్ఇ) ఆధ్వర్యంలో ఈనెల 13న శుక్రవారం నిర్వహించనున్న సౌత్‌జోన్ రీజనల్ వర్క్‌షాప్‌కు విశాఖపట్నం నోవాటెల్ వేదిక కానుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరు కానున్న ఈ సమావేశానికి కేంద్ర మంత్రి ప్రహ్లాద వెంకటేష్ జోషి, తెలంగాణ, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, కర్ణాటక రాష్ట్రాల విద్యుత్ శాఖ మంత్రులు, ఉన్నతాధికారులు, ఎంఎన్ఆర్ఇ, విద్యుత్ పంపిణీ సంస్థల ప్రతినిధులు, నేషనల్ సోలార్ ఎనర్జీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సభ్యులు పాల్గొనున్నారు. మన రాష్ట్రం తరపున విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, నెడ్ క్యాప్ విసి అండ్ ఎండి ఎం కమలాకర్‌బాబు, ఎపిఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి, ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి కె సంతోషరావు, ఎపిసిపిడిసిఎల్ సీఎండి పి పుల్లారెడ్డి హాజరౌతారు. ఈ వర్క్ షాప్‌లో పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ వంటి ప్రభుత్వ పథకాల అమలు తీరు, విండ్ ఎనర్జీ, సోలార్ ఎనర్జీ, హైడ్రో పవర్ ఎనర్జీ వంటి పునరుత్పాదక ఇంధన వనరుల ఆవశ్యకతపైనా ప్రధానంగా చర్చించనున్నారు. వర్క్ షాప్ నిర్వహణ బాధ్యత రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ చూడనుంది.

గంజాయి నిందితుడికి పదేళ్ల జైలు

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : గంజాయి అక్రమ రవాణా కేసులో ప్రధాన నిందితుడికి పదేళ్ల కఠిన శిక్ష, రూ.లక్ష జరిమనా విధిస్తూ విశాఖపట్నం మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టు తీర్పునిచ్చిందని ప్రభుత్వ రైల్వేపోలీస్‌స్టేషన్ సిఐ సిహెచ్.ధనుంజయనాయుడు తెలిపారు. సిఐ తెలిపిన వివరాలివి.

గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు నిరంతర నిఘా, తనిఖీల్లో భాగంగా 2014లో 24 కిలోల గంజాయితో కొర్ర ప్రసాంత్‌కుమార్ పట్టుబడ్డాడు. దీనిపై రైల్వేపోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం కోర్టులో ఛార్జిసీట్ దాఖలు చేయగా, ప్రభుత్వ న్యాయవాది జివిఎస్ఎన్‌వి. ప్రసాద్ మార్గదర్శకత్వంలో రైల్వేపోలీస్‌స్టేషన్ .ధనంజయనాయుడు, కోర్టు హెడ్‌కానిస్టేబుల్ జి.వెంకటేశ్వరరావు కేసులో బలమైన ఆధారాలను కోర్టుకు సమర్పించడంతో ఈ మేరకు న్యాయమూర్తి కఠినశిక్షను విధిస్తూ తీర్పుచెప్పారని సిఐ ధనుంజయనాయుడు తెలిపారు. ఈ తీర్పుద్వారా గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణాలో భాగమైన వారికి కఠిన చర్యలు తప్పవని న్యాయస్థానం ద్వారా హెచ్చరికలు జారీ చేసినట్టేనని సిఐ వెల్లడించారు.

శ్వేతాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా వెంకటేశ్వరస్వామి తిరుమంజనం

ప్రజాశక్తి - రంపచోడవరం : మండలంలోని ఐ.పోలవరం, టిటిడి అధీనంలో ఉన్న గోవిందగిరి క్షేత్రంలో బుధవారం జ్యేష్ఠాభిషేకం సందర్భంగా స్వామివారికి శ్రీవారిస్నపన తిరుమంజనం (క్షీరాభిషేకము) గ్రామస్తులు సంయుక్తంగా స్వామివారికి ఉపవసము కలిగించేందుకు చేసే కైంకర్యం నిర్వహించారు. ఆలయ అధికారి నారాయణబాబు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు గోపర్గం మణికంఠా చార్యులు, శ్రీపార్థ శ్రీనివాస్, వేదపండితులు శ్రీసాయిరామ్‌శర్మ నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొని శ్రీవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శస్త్రచికిత్స చేస్తున్న వైద్యులు

మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏరియా ఆసుపత్రిలో మొట్టమొదటిసారి మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతమైందని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషారెడ్డి తెలిపారు. గంగవరం మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన మల్లెపు మంగ అనే మహిళ ఎడమకాలు నొప్పితో బాధపడుతూ మూడు రోజుల కిందట ఏరియా ఆసుపత్రికి వచ్చింది. ఆమె పది సంవత్సరాలుగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నట్లు డాక్టర్లకు తెలిపింది. సూపరింటెండెంట్ డాక్టర్ శేషారెడ్డి ఆదేశాల మేరకు బుధవారం ఏరియా ఆసుపత్రిలో శస్త్రచికిత్స నిర్వహించామని ఆయన తెలిపారు. జిల్లాలోనే మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్స చేయడం ఇదే మొదటిసారని తెలిపారు శస్త్రచికిత్స విజయవంతం కావడంతో రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం వైద్యులను అభినందించారని తెలిపారు. చికిత్సలో ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ సుధాకర్, డాక్టర్ ప్రదీప్ ఎనస్థీషియా డాక్టర్ రోహిణీ నిర్వహించారని తెలిపారు.

16న బహిరంగ వేలం

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : జివిఎంసి జోన్-4లో పలు వాణిజ్య సముదాయాల దుకాణాలకు, ఒక కల్యాణ మండపం, ఒక మార్కెట్, మెయిన్ ఆఫీస్ క్యాంటీన్‌కు ఈ నెల 16వ తేదీ ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ ఎమ్.మల్లయ్యనాయుడు తెలిపారు. జివిఎంసి 4వ జోన్ (సూర్యాబాగ్) పరిధిలో గల డైక్ టౌన్, జగదాంబ వాణిజ్య సముదాయాలు, పాత పోస్ట్ ఆఫీస్ షాపింగ్ దుకాణాలు, పద్మనగర్, సూర్యబాగ్, టిఎస్‌ఆర్, కనకంపల్లి వాణిజ్య సముదాయాల్లోని మిగిలిన దుకాణాలకు, జివిఎంసి మెయిన్ ఆఫీస్ క్యాంటీన్, అంబేద్కర్ కల్యాణ మండపం, రెల్లివీధి రోడ్ సైడ్ మార్కెట్లను మూడేళ్ల కాల పరిమితికి గుత్తకు ఇచ్చేందుకు బహిరంగ వేలం పాట ఉంటుందని పేర్కొన్నారు. సదరు వేలంపాటలో పాల్గొనదలచిన వారు ధరావత్తు సొమ్ము తదితర పూర్తి వివరాలకు 4వ జోనల్ కార్యాలయం పని వేళల్లో సంప్రదించాలని సూచించారు.

అటవీశాఖ అధికారుల అభ్యంతరంతో ఆగిపోయిన

రోడ్డు పనులను పున:ప్రారంభించాలి

• అర్ధనగ్నంగా డోలీలతో గిరిజనుల వినూత్న ర్యాలీ

అర్ధనగ్నంగా డోలి మోతలతో నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి-అనంతగిరి:ఫారెస్టు అధికారుల అభ్యంతరంతో నిలిచిపోయిన రోడ్డు పనులు తక్షణమే పున్ణప్రారంభించాలని, అనుమతులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం గుమ్మ పంచాయతీ కళ్యాణ్ గుమ్మ గ్రామం వద్ద వినూత్న రీతిలో అర్ధనగ్నంగా డోలీలతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు నందుల. రామారావు, రాపా రామరావులు మాట్లాడుతూ, తమ గ్రామానికి అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం నేరెళ్లపూడి గ్రామం నుండి కళ్యాణ్ గుమి గ్రామానికి 2024 సంవత్సరంలో రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని తెలిపారు. రోడ్డు పనులు ప్రారంభించగా ఫారెస్ట్ అధికారులు అడ్డుకోవడంతో రోడ్డు పనులు నిలిచి పోయాయని తెలిపారు. నేటికి సంవత్సరం గడుస్తున్నా. ఫారెస్టు అనుమతులు లేకపోవడంతో రోడ్డు పనులు ప్రారంభించలేదన్నారు. రోడ్డు సౌకర్యం లేక గ్రామంలో 12 మంది పిల్లలు అడవి మార్గంలో రాను పోను ఆరు కిలోమీటర్ల దూరం దేవరాపల్లి మండలం బోడుగరువు గ్రామానికి చదువుకోడానికి వెళ్తున్నారని తెలిపారు. మార్గం మధ్యలో గెడ్డలు దాటుకుంటూ ప్రయాణించ వలసి వస్తుందన్నారు. అనారోగ్యం బారిన పడిన రోగులను 50 కిలోమీటర్ దూరంలో ఎత్తయిన కొండ కోనలు దట్టమైన అటవీ ప్రాంతం మీదుగా లుంగపర్తి ప్రాథమిక వైద్య కేంద్రానికి వెళ్లవలసి వస్తుందని తెలిపారు. ఓట్లు వేయాలంటే సరిహద్దు రెండు జిల్లాలు దాటుకుంటూ గుమ్మ పంచాయతీ కేంద్రంలో వెళ తున్నామన్నారు. గత ఏడాది కర్రిగొడ గ్రామంలో అనారోగ్యంతో గిరిజనులు మృత్య వాత పడిన విషయంపై గ్రామాన్ని సందర్శించిన ఎంపీడీవో తిరుగు ప్రయాణంలో మార్గ మధ్యలో కొండ ఎక్కలేక అస్వస్థకు గురయ్యారని తెలిపారు. ఎంపీడీవోను డోలీలో కొండెక్కి గుమ్మ వరకు తీసుకు వెళ్ళడం జరిగిందన్నారు. తక్షణమే ఫారెస్ట్ అధికారులు అనుమతులు ఇవ్వకుంటే ఈ నెల 20న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద డోలీ యాత్రతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు పాల్గొన్నారు

కేంద్ర ప్రభుత్వ పథకాలతో గిరిజన సాధికారిత

• 518 గ్రామాలలో పిఎం జుగాపై అవగాహన

• 15 నుండి 30 వరకు గ్రామ సభలు

• వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ దినేష్ కుమార్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు: సమగ్ర గిరిజనాభివృద్ధే లక్ష్యంగా ప్రధాన మంత్రి దర్తీ అభా జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ (పీ ఎం జుగా) జనజాతీ ఆదివాసీ న్యా మహా అభియాన్ (పి ఎం జన్మన్) పీ ఎం జన్మన్ పై ఈనెల 15 నుండి 30 వ తేదీ వరకు గిరిజనులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. సమగ్రమైన గిరిజనాభివృద్ధికి పీఎం జుగా దోహద పడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో గిరిజన సాధికారతకు కృషి చేస్తామని చెప్పారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్సు హాలులో విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. గిరిజన ప్రాంతంలో అత్యంత వెనుకబడిన గ్రామాలను గుర్తించి ప్రత్యేక సదస్సులు నిర్వహించి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పిస్తామన్నారు. అర్హులైన లబ్దిదారులను గుర్తించి ప్రభుత్వ పథకాలను అందిస్తామని స్పష్టం చేసారు. పాడేరు మండలంలో 260 గ్రామాలు, రంపచోడవరం లో 211 గ్రామాలు, చింతూరు డివిజన్లో 57 గ్రామాలలో సదస్సులు నిర్వహిస్తామన్నారు. అర్హులైన లబ్దిదారులను గుర్తించిన ప్రాధాన్యతా క్రమంలో ప్రభుత్వ పథకాలను అమలు తీరును పర్యవేక్షించడానికి జిల్లా స్థాయిలో పరిపాలనా కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. లబ్దిదారులకు ఆధార్ కార్డుల రిజిస్ట్రేషన్లు, పిఎం జన్ ధన్ బ్యాంకు ఖాతాలు తెరవడం, కొత్త గ్యాస్ కనెక్షన్లు, ఆయుష్మాన్ హెల్త్ కార్డులు, రేషన్ కార్డులు, కిసాన్ కార్డులు, కులధృవీకరణ పత్రాలు, ఉపాధి హామీ జాబ్ కార్డులు, పోషన్ అభియాన్ నమోదు, 123 రకాలు కార్యక్రమాలు అమలు చేసి గిరిజనులకు లబ్ది కూరుస్తామన్నారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య భోజన సదుపాయాలు వసతి సౌకర్యాలు కల్పించడానికి జిల్లాకు 22 హాస్టల్సు మంజూరయ్యాయన్నారు. పాడేరు డివిజన్లో రూ.1కోటి వ్యయంతో, రంపచోడవరం డివిజన్ మారేడుమిల్లి మండలం అకుమామిడి కోట గ్రామంలో రూ. 1 కోటి వ్యయంతో గిరిజన మల్టీపర్పస్ మార్కెటింగ్ కేంద్రాలు మంజూరయ్యాయన్నారు.పాడేరు డివిజన్ లో 189103 ఎకరాల అటవీ భూములను 112873 మందికి పట్టాలు పంపిణీ చేసామని చెప్పారు. రంపచోడవరం డివిజన్లో 25,145 మంది హక్కుదారులకు పట్టాలు పంపిణీ చేసామన్నారు. పాడేరు డివిజన్లో 2 వేల మందికి రంపచోడవరం డివిజన్ 1496 మందికి పట్టాలు పంపిణీ చేయవలసి ఉందన్నారు. 1550 మొబైల్ టవర్లు ఏర్పాటు చేసి కమ్యూనికేషన్ సదుపాయాలు కల్పించామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ఐఐఎఎం బిజినెస్ స్కూల్‌తో ఐజిఎంఎ ఒప్పందం

డాక్టర్ మోహన్‌లాల్ అగర్వాల్, ఎస్‌పి.రవీంద్ర, ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్
(ఎడమ నుండి కుడి వైపునకు)

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అకడమిక్ సహకారం ఇండస్ట్రీ అకాడమీ వ్యవస్థ బలోపేతం కోసం ఎంవిపి కాలనీలోని ఐఐఎఎంతో ఇండోగల్ఫ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఐజిఎంఎ) బుధవారం ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా ఐజిఎమ్ఎ ప్రెసిడెంట్ డాక్టర్ మోహన్‌లాల్ అగర్వాల్, ఐఐఎఎం బిజినెస్ స్కూల్ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్‌లాల్ అగర్వాల్ మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా ఉమ్మడి పరిశోధనలో ఫ్యాకల్టీ, విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలు ఇండస్ట్రీ ఆధారిత వర్క్ షాప్‌లు, మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ అవకాశాలను ప్రోత్సహించడానికి ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ ఒప్పందం ద్వారా ఐజిఎంఎ సేవలను అతి తక్కువ రుసుంతో వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. సాధారణంగా గల్ఫ్‌లో మేనేజ్‌మెంట్ కోర్సులకు రూ.22 లక్షల వరకు ఖర్చు అవుతుండగా ఈ ఒప్పందం ద్వారా కేవలం రూ.8 లక్షలతోనే పూర్తిచేసే అవకాశం ఉందని తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు ఎంఎస్సీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎమ్మెస్సీ సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి అత్యాధునిక కోర్సులను అందిస్తున్నామని వివరించారు. రెండేళ్ల మేనేజ్‌మెంట్ కోర్సులో ఒక సంవత్సరం ఐఐఎఎం, మరొక సంవత్సరం ఐజిఎంఎ ద్వారా దుబాయ్‌లోను విద్యను అభ్యసించవచ్చనని తెలిపారు. ఐఐఎఎం బిజినెస్ స్కూల్ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ, ఇది స్థానిక విద్యార్థులకు, అధ్యాపకులకు సువర్ణ అవకాశమన్నారు. కోర్సుల అనంతరం దుబాయ్‌లో ఇంటెన్షిప్ చేసే అవకాశం కూడా ఈ ఒప్పందం ద్వారా కల్పిస్తున్నామని తెలిపారు. సర్టిఫికేషన్‌పై విద్యార్థులు ఎటువంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని, ఐజిఎంఎ సర్టిఫికెట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీ రికగ్నైజేషన్ కలిగి ఉందని తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా ఇతర విశ్వవిద్యాలయాల్లో ఆన్‌లైన్ కోర్సులు అభ్యసించేందుకు అవకాశం కల్పిస్తున్నారని, దీనికి 60 డాలర్ల నామమాత్రపు అప్లికేషన్ ఫీజు చెల్లించి కోర్సును నేర్చుకోవచ్చని తెలిపారు. సర్టిఫికెట్ కోసం వారు నిర్వహించే పరీక్షలలో ఉత్తీర్ణత సాధించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐఎఎం బిజినెస్ స్కూల్ డీన్, డైరెక్టర్ ఎస్‌పి.రవీంద్ర, జాయింట్ డైరెక్టర్ పి.శివకుమార్, సభ్యులు శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన

విఎంఆర్‌డిఎ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్

ప్రజాశక్తి - విశాఖపట్టణం: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 13వ తేదీన విశాఖలో పర్యటించనున్న నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ నోవోటెల్, విఎంఆర్డిఎ డెక్ భవనం, విఎంఆర్డిఎ చిల్డ్రన్ ఎరీనాను పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, విఎంఆర్డిఎ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, డిసిపి అజిత ఇతర అధికారులతో కలిసి బుధవారం సందర్శించారు. ప్రాథమిక సమాచారం మేరకు 13న ఉదయం మినిస్ట్రీ ఆఫ్ న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ ఆధ్వర్యంలో నోవాటెల్ హోటల్లో రెన్యువబుల్ ఎనర్జీ వర్క్‌షాప్ జరగనుండగా, మధ్యాహ్నం అంతర్జాతీయ యోగా దినోత్సవ నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష జరగనుంది. అనంతరం విఎంఆర్డిఎ పరిధిలో నూతనంగా నిర్మించిన డెక్ భవనం, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభోత్సవం జరగనున్నాయి. కొన్ని పారిశ్రామిక సంస్థలు, ఐటి సంస్థలతో ఒప్పందాలు (ఎంవోయూ) జరగనున్నాయి. తదుపరి విఎంఆర్డిఎ చిల్డ్రన్ ఎరీనాకు చేరుకుని వివిధ పరిశ్రమలకు సంబంధించి శంకుస్థాపనలు, పారిశ్రామిక వేత్తలతో ముఖాముఖి నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి వివిధ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కానున్న వేదికలను పరిశీలించిన కలెక్టర్ సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

కొత్త వేతనాలు అమలుచేయాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మే నెలలో ఆప్కోస్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన విధంగా కొత్త వేతనాల బిల్లులను చెల్లించాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.సత్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనియన్ ఆధ్వర్యాన బుధవారం జివిఎంసి ప్రధాన కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం మేయర్ పీలా శ్రీనివాసరావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ, జివిఎంసి మంచి నీటి సరఫరా విభాగంలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులకు కార్పొరేషన్ తీర్మానం ప్రకారం గత సంవత్సరం డిసెంబర్ నెల నుంచి కొత్త వేతనాలు అమలు చేయాల్సి ఉందన్నారు. ఈ ఏడాది మే నెలలో ఆప్కోస్ వెబ్ సైటులో కొత్త జీతాల బిల్లు అప్‌లోడ్ చేశారని, అప్ లోడ్ చేసిన కొత్త జీతాలు నేటికి జమకాకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఈ నెల పాత జీతాలు బిల్లునే మళ్లీ పెడుతున్నారనే విషయం తెలిసి ఆందోళనకు దిగామని తెలిపారు. మేయర్ స్పందించి సమస్య పరిష్కరిస్తామని, విధులకు హాజరు కావాలని కోరడంతో టూల్ డౌన్ విరమించి డ్యూటీకి హాజరైనట్లు తెలిపారు.

వికలాంగుల పింఛన్ పెంపునకు మంద కృష్ణ మాదిగ కృషి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వికలాంగుల పింఛన్‌ను రూ.6 వేలకు పెంచేందుకు ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ కృషి చేశారని వికలాంగుల హక్కుల పోరాట సమితి విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు అక్కిరెడ్డి అప్పారావు తెలిపారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద గురువారం వికలాంగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ వచ్చిన సందర్భంగా ఈనెల 19వ తేదీన హైదరాబాదులో సన్మానం చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పేరెల్లి ఎలీషా భాష మాదిగ పాల్గొన్నారు.

22న గీతం ప్రవేశ పరీక్ష

- 19లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు అవకాశం

ప్రజాశక్తి- మధురవాడ : ప్రస్తుత విద్యాసంవత్సరంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం పరిధిలో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 22న జాతీయస్థాయిలో 12 రాష్ట్రాలలో ఎంపిక చేసిన 42 పట్టణాలలో ఆన్‌లైన్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (గ్యాట్-2025) నిర్వహిస్తున్నట్లు గీతం అడ్మిషన్ల డైరక్టర్ ఎం.జగదీష్ తెలిపారు. గ్యాట్ ప్రవేశపరీక్ష పూర్తివివరాలకు గీతం వెబ్‌సైట్ www.gitam.edu ను పరిశీలించి, ఈ నెల 19లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంజనీరింగ్ (బిటెక్, ఎంటెక్), ఫార్మశీ (బి.ఫార్మశీ, ఎమ్.ఫార్మశీ), ఆర్కిటెక్చర్ (బిఆర్క్, ఎమ్.ఆర్క్), మేనేజ్‌మెంట్ (ఎంబిఎ, బిబిఎ, బికామ్), సైన్స్ (ఎమ్మెస్సీ, బిఎస్సీ, ఎంసిఎ, బిసిఎ), లా కోర్సులు, హ్యుమానిటీస్, నర్సింగ్, ఫిజియోథెరిపి, పారామెడికల్ కోర్సులలో ప్రవేశాలు ఉంటాయన్నారు.

ఇంటర్ విద్యార్థులకు సైన్స్ డిగ్రీ కోర్సులు

ఇంటర్మీడియట్ సైన్స్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ విత్ కాగ్నిటివ్ సిస్టమ్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, మేథ్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లలో నాలుగేళ్ల బిఎస్‌సి (ఆనర్స్) కోర్సులు, మూడేళ్ల బిసిఎ కోర్సు అందుబాటులో ఉన్నాయన్నారు. పిజి స్థాయిలో అప్లైడ్ మేథ్స్, బయోకెమిస్ట్రీ అండ్ మాలిక్యులర్ బయాలజీ, డేటాసైన్స్, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లలో రెండేళ్ల ఎంఎస్‌సి కోర్సులు, మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసిఎ) కోర్సు నిర్వహిస్తున్నామన్నారు.

పారా మెడికల్ కోర్సులు

వైద్య ఆరోగ్యరంగంలో పెరుగుతున్న ఉపాధి అవకాశాలను దృష్టిలో పెట్టుకుని, గీతం వర్సిటీ విశాఖ ప్రాంగణంలో బిఎస్‌సి మెడికల్ ల్యాబోరేటరీ టెక్నాలజీ, బిఎస్‌సి ఎమర్జెన్సీ మెడిసిన్, ఫిజియోథెరిపి, నర్సింగ్ కోర్సులను నిర్వహిస్తున్నామన్నారు.

కామర్స్ మరియు మేనేజ్‌మెంట్ కోర్సులు:

మేనేజ్‌మెంట్ విద్యపై ఆసక్తి గల విద్యార్థులకు గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ద్వారా యుజి స్థాయిలో బికాం, బిబిఎ (బిజినెస్ ఎనలిటిక్స్, ఫైనాన్సియల్ మార్కెట్స్), జనరల్ బిబిఎ కోర్సులు, పిజి స్థాయిలో ఎంబిఎ కోర్సు నిర్వహిస్తున్నామన్నారు. వైద్య ఆరోగ్య రంగంలో నిపుణుల ప్రాధాన్యత దృష్ట్యా ఎపి మెడ్‌టెక్ జోన్, అకాడమి ఆఫ్ హాస్పటల్ మేనేజ్‌మెంట్‌తో సంయుక్త సహకారంతో హాస్పిటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్‌లో ఎంబిఎ కోర్సు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

ప్రజాశక్తి జట్టు ఘనవిజయం

సంబరాల్లో ప్రజాశక్తి క్రీడాకారులు

ప్రజాశక్తి- సీతమ్మధార : ఎపియుడబ్ల్యుజె ఆధ్వర్యంలో ఉత్తరాంధ్రలో తొలిసారిగా ఫ్లడ్‌లైట్స్ వెలుతురులో విశాఖపట్నం పోర్ట్ స్టేడియం వేదికగా ప్రతిష్టాత్మకంగానిర్వహిస్తున్న జర్నలిస్ట్ ప్రీమియర్ లీగ్ (జెపిఎల్) పోటీల్లో ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్ల జట్టుపై ఏడు వికెట్ల తేడాతో ప్రజాశక్తి దినపత్రిక విశాఖపట్నం ఎడిషన్ జట్టు ఘనవిజయం సాధించింది. బుధవారం సాయంత్రం పోర్ట్ స్టేడియంలో జరిగిన పోటీలో టాస్ గెలిచి మొదటి బ్యాటింగ్ చేసిన ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్స్ జట్టు వాసు 32 పరుగుల సహాయంతో నిర్ణీత 10 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 72 పరుగులు చేసింది. అనంతరం 73 పరుగుల విజయ లక్ష్యంతో బరిలో దిగిన ప్రజాశక్తి విశాఖపట్నం జట్టు బ్యాటర్ మహేష్ 41 పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచి అద్భుత ప్రతిభ కనబర్చడంతో 7.3 ఓవర్లలో కేవలం 3 వికెట్లు కోల్పోయి, మరో 15 బంతులు మిగిలి ఉండగానే 74 పరుగుల విజయలక్ష్యాన్ని ఛేధించింది. ప్రజాశక్తి జట్టు ఆటగాళ్లు మహేష్, ప్రదీప్, రమేష్, శంకర్ అద్భుత సహకారాన్ని అందించించారు. ప్రజాశక్తి జట్టు విజయం పట్ల ఎడిషన మేనేజర్ వెంకటేశ్వరరావు, బ్యూరో చీఫ్ మధుసూధనరావు, అడ్వర్టైజ్‌మెంట్ మేనేజర్ రాజేష్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. జట్టు సభ్యులను అభినందించి, వారితోపాటు విజయసంబరాల్లో పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ర్యాపిడో సేవలు మరింత విస్తరణ

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : ప్రముఖ రైడ్ హైరింగ్ సంస్థ ర్యాపిడో ఆంధ్రప్రదేశ్ తమ కార్యకలాపాలను మరింత విస్తరిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి పవన్ గుంటుపల్లి తెలిపారు. సిరిపురంలోని ర్యాపిడో కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తమ సంస్థ సేవలు ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా 14 నగరాల్లో ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఒంగోలు, విజయనగరం, ఏలూరు, మదనపల్లి, మచిలీపట్నం, చిత్తూరు, శ్రీకాకుళం, భీమవరం, గుడివాడ, నరసరావుపేట, నంద్యాల, తెనాలి, తాడేపల్లిగూడెం, తాడిపత్రి నగరాల్లో తమ సేవలు విస్తరిస్తున్నామని పేర్కొన్నారు. విశాఖపట్నం కేంద్రంగా ఈ సేవలు అందించే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సంస్థ దేశవ్యాప్తంగా 500 నగరాల్లో సేవలు అందించాలని లక్ష్యంగా పెట్టుకుందని, ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా తమ సేవలు విస్తరిస్తున్నామని తెలిపారు. రాపిడో సంస్థ ఇప్పటికే 9 లక్షలకు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించిందని, ఈ విస్తరణ ద్వారా మరో లక్ష కొత్త ఉద్యోగాల అవకాశాలు సృష్టించి స్థానికులకు ఆర్థిక స్వాతంత్ర్యం సౌకర్యవంతమైన సంపద సామర్థ్యాన్ని అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకుందని వివరించారు. ప్రస్తుతం ప్రతిరోజూ ర్యాపిడో నాలుగు లక్షల మందికి పైగా ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేర్చుతుందన్నారు. స్థానిక యువత ర్యాపిడో కెప్టెన్లుగా చేరి ఆదాయం పొందుతున్నారని వివరించారు.

నేటి నుంచి 'ఇగ్నో' వార్షిక పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 2025 వార్షిక పరీక్షలు గురువారం నుండి ప్రారంభమవుతున్నాయని ప్రాంతీయ కేంద్ర సీనియర్ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం పరిధిలో 5 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేశామని, సుమారు 5000 మంది పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు హాల్ టికెట్లు విశ్వవిద్యాలయం వెబ్ సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు వాటిని డౌన్‌లోడ్ చేసుకొని, దానితో పాటు గుర్తింపు కార్డు తీసుకొని పరీక్షలకు హాజరు కావాలని కోరారు. మొబైల్ ఫోన్స్ తదితర సాంకేతిక ఉపకరణాలను పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టంచేశారు. ఇగ్నో జారీ చేసిన గుర్తింపు కార్డు తప్పని సరిగా తీసుకురావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఎంవిపి.కాలనీ ఉషోదయ జంక్షన్‌లో ఉన్న ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని లేదా సంబంధిత పరీక్షా కేంద్రాలను ముందుగానే సంప్రదించాలని సూచించారు.

పిహెచ్‌డి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలి

ఎస్‌ఎఫ్ఐ ఎయు కార్యదర్శి వెంకటరమణ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఇటీవల ఎయిడెడ్ ప్రొఫెసర్లను తొలగించడంతో వారి వద్ద ఉన్న పరిశోధక విద్యార్థులకు గైడ్ లేని పరిస్థితి ఏర్పడిందని, పరిశోధనను ఎలా కొనసాగించాలో తెలియక వారు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని, విద్యార్థుల హక్కులను పరిగణనలోకి తీసుకొని, యుద్ధ ప్రాతిపదికన ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని భారత విద్యార్థి ఫెడరషన్ (ఎస్ఎఫ్ఐ) ఎయు కార్యదర్శి డి.వెంకటరమణ కోరారు. పిహెచ్‌డి విద్యార్థులు తీసుకున్న కోర్సులకు అనుగుణంగా కొత్త గైడ్‌లను నియమించి, వారి పరిశోధన సబ్మిషన్ గడువులోపే పూర్తి చేయగల అవకాశాన్ని కల్పించాలని, విద్యార్థుల అకడమిక్ ప్రయాణాన్ని అర్థాంతరంగా నిలిపేయకుండా, వారు నష్టపోకుండా విశ్వవిద్యాలయం, అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. విశ్వవిద్యాలయంలో పరిశోధన సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు కల్పించాలని, విద్యార్థుల ఆసక్తిని బట్టి పరిశోధన మార్గదర్శకత్వం కేటాయించేలా చర్యలు చేపట్టాలని, ఒక పరిశోధనా స్కాలర్‌కు డిప్యూటెడ్ ఫ్యాకల్టీ కింద పిహెచ్‌డి చేయడానికి ఆసక్తి ఉంటే మార్గదర్శకత్వం కొనసాగించాలని, లేకుంటే విద్యార్థి ఆసక్తిని బట్టి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. వీటితో పాటు ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, కోర్సు, అనుభవం, పరిశోధన రంగానికి అనుగుణంగా గైడ్‌లను కేటాయించాలని డిమాండ్ చేశారు.

వేడుకగా ఏరువాక పౌర్ణమి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రైల్వే స్టేషన్‌కు చేరువలో ఉన్న 150 సంవత్సరాల మర్రిచెట్టు వద్ద గ్రీన్‌క్లైమేట్ టీం, వనమాలి, సిటిజి, మన కూరగాయల తోట తదితర సంస్థలు బుధవారం ఏరువాక పౌర్ణమి పూజా కార్యక్రమాలు నిర్వహించాయి. ఈ సందర్భంగా గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జెవి.రత్నం మాట్లాడుతూ, ఆహారం భుజించే అందరి పండగ ఏరువాక పౌర్ణమి అని తెలిపారు. వనమాలి సిటిజి గ్రూపుల అడ్మిన్ మళ్ల సరిత మాట్లాడుతూ, ప్రకృతి ఆధారంగా కూరగాయలు పండించుకోవాలని కోరారు. సహజసిద్ధమైన పంటలు తింటే ఆరోగ్యం కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కె.ప్రసాద్, పెందుర్తి హాస్టల్ వార్డెన్ సత్య, యాక్షన్ ఎయిడ్ సంస్థ ప్రతినిధి ఐ.కృష్ణకుమారి, వనమాలి సిటిజిల అడ్మిన్ అరవల అరుణ, గ్రీన్ క్లైమేట్ టీం కోఆర్డినేటర్ జె.రాజేశ్వరి, విశ్రాంత ఉపాధ్యాయులు పంతుల లలిత తదితరులు పాల్గొన్నారు.